# జ్ఞాపకం

డా॥ కె. వివేకానందమూర్తి

రాక్షసజాతి పామేదో పగబట్టి కరవడాని కొస్తూంటే ప్రాణరక్షణకోసం పరిగెడుతున్నట్టు, రైలు స్టేషన్లోకి పొగలు సెగలూ కక్కుతూ వస్తూంటే చిందరవందరగా పరుగెడుతున్నారు జనం.

తలల మధ్యనుంచి తారకేశ్వరి చూపు కాటుతిన్నవాడిలా అయిపోయాను. పక్కన యిప్పుడు ఒక్క కూతురే వుంది. మిగతా కూతురికి పెళ్ళయిపోయినట్లుంది ఆమె ఆయన కోసం చూస్తున్నట్టుగా వుంది. అంతలో వాటర్ బాటిల్‌లో నీరు నింపుకుని వొంపుకుంటూ వొగర్చుకుంటూ ఆమెను వచ్చి చేరాడు ఆమె భర్త పార్థసారధి. తారకేశ్వరి నాకేసి 'క్షుద్రుడా!' అన్నట్టొక చూపుచూపి తారలా మెరిపి మాయమయిపోయింది. వాళ్ళంతా ఏదో పెట్టెక్కేసారు.

నేను నా ఫ్రెండుకి 'టాటా' చెప్తూండగా రైలు బుసబుసలు కొట్టుకుంటూ కడుపునిండా జనాన్ని తిని ఆకలి నింపుకున్న కసి బుసంలేని పాములా పాకిపోయింది.

క్షణంలో ప్లాట్‌ఫారమ్ అంత్య దహన క్రియలు పూర్తయిపోయిన స్మశానంలా అయిపోయింది.

దీపాలమధ్య ఒంటరిగా నేను దీనంగా విలబడిపోయాను.

అంచు వెంబడే అడుగులువేస్తూ వెళ్ళిపోయే రైలుని వెనకచూపు చూశాను.

నా కప్పుడు సికింద్రాబాదు ట్రాన్స్ఫరయింది. ఆమే నేనూ పల్లెటూరింటి ఒకే పేటలో వుండేవాళ్ళం. కలసికాదు. కలిసి మెలిసి.

ఆమె వర్ధమాన రచయిత్రి. నేను వర్తమాన రచయితని. రచనని ఆసరా చేసుకుని రంగంలోకి దూకాను. చాలా రోజులపాటు యిద్దరం లోకల్ లెటర్స్‌లోనే లోకాన్ని మరిచిపోయేవాళ్ళం. కొందరి ప్రేమ లోకోత్తరం— నా ప్రేమ లోకల్ ఉత్తరం.

పెళ్లాన్ని పుట్టింటికి పంపించిన నేను, పేరుప్రఖ్యాతుల్ని ఆమెకు ఎరగాపెట్టి కైవశం చేసుకోగలిగాను.

ఆమె ఒకరోజు నన్ను టీకి పిలిచింది. వెళ్లాను. టీ తాగుతున్నప్పుడు నాకు చాలా ధర్మసందేహాలొచ్చాయి—ఆమె నన్ను ప్రేమిస్తోందా? సాపులారిటీకోసం చనువిస్తోందా? తనువిస్తుందా? నా తనివి తీరుస్తుందా?— వగైరాలు. ఓపిగ్గా స్టడీచేశాను.

ఓరోజు ఎప్పటిలాగే వాళ్ళ లాన్‌లో టీ తాగుతూండగా వాళ్ళాయన వాన్‌లో వచ్చాడు. నా కప్పటికే ఆయన పరిచయమైపోయాడు. లేవబోయాను. టీ కాస్త నా షర్టుమీద వొలికింది. 'టేక్ ఆన్!' అన్నాడాయన వాన్ దిగి మాతో కలుస్తూ.

తారకేశ్వరి అంది ఆయనతో— 'ఏవండీ! యివాళ సినిమా కెళ్దాం!'

'దానికింత ఆలోచనెందుకూ? బైల్దేరు!' అన్నాడాయన.

ఆమె, 'నేనన్నది మీరే అంటే ఎంత బాగుంటుంది?' అంది.

'ఇవాళ సినిమా కెళ్దాం' అనేసి టై విప్పుకుంటూ లోపలికెళ్ళిపోయా డాయన.

"చూడరా. ఇదీవరస. 'తారా! ఇవాళ మనిద్దరం ఈ వెన్నెల్లో సినిమాకెళ్తే ఎంత బాగుంటుంది!?' అనంటే ఎంతబాగుంటుంది!" అంది.

నా కిప్పుడు కేసు అర్థమైపోయింది. భర్త గురించి పరాయివాడి దగ్గర విమర్శించేసరికి మరీ అర్థమైపోయింది.

అనేసాను. 'తారా! ఇవాళ మనిద్దరం ఈ వెన్నెల్లో సినిమాకెళ్తే ఎంతబాగుంటుంది!'

తారకేశ్వరి నాకేసి తేరిచూపింది. జంకకుండా నేను తేరిపార చూసాను. విషయం తెలిపోయింది. కళ్ళు కలిసిపోయి వొళ్లు పులకరించాయి. ఆమె సాన్నిహిత్యాన్ని పెంచుకునే ప్రయత్నంలో ఆమెతో సాహిత్యం గురించి మాట్లాడుతూ సినిమా చూడ్డం చేసాను.

చాలా రాత్రి గడిపేశాను.

చాలా రాత్రులు గడపాలనుంది. 'గుడ్ నైట్' చెప్పి తిరిగి వచ్చేశాక నాకు నిద్ర పట్టలేదు. తారకేశ్వరి తను సౌందర్యం నన్ను తట్టుకోలేకపోయేలా చేస్తోంది.

తారకేశ్వరి ఎత్తుగా వుంటుంది. ఎత్తైన వక్షోజాలతో వుంటుంది. ఎర్రగా వుంటుంది. ఎర్రనైన పెదవుల కాంతి చెక్కిళ్ళమీద పడుతున్నట్టుగా వుంటుంది. ఎంతో బాగుంటుంది. గ్రీకు శిల్పంలా వుంటుంది. నేను కవిని కాను. ఆమె అందాన్ని వర్ణనలో కూడా అనుభవించడాన్నే కోరుకునే కోరికగల వాణ్ణి.

తర్వాత రోజునుంచీ ఆమె ఇంటికి నా రాకపోకలు వుధృతమయ్యాయి. వాళ్ళాయన, అంటే పార్థసారధి అపార్థసారధి కాదు. అపారమైన మంచితనాన్ని నాక్కావలిసినంత ప్రసాదించి, నా ప్రయత్నాలకి ప్రాతిపదికల్ని తనకి తెలీకుండానే పదిలంచేసి ఇచ్చి నన్ను నడిపిస్తూన్న సారధి.

అవాళాయన కాంపు కెళ్ళాడు.

నేను వాళ్ళింట్లో కాంపు చేసాను.

సూర్యుడు పగలు కక్కుతున్నాడు.

ఆమె వగలు కక్కుతోంది.

పిల్లలు స్కూలుకెళ్ళారు. పిట్ట అరిచినా పిడుగనిపించేంత ప్రశాంతత.

ఆమె నాకు ఇల్లు చూపిస్తూంటే, నేనామె వొళ్ళు చూస్తున్నాను. లేక ఆమె నాకు వొళ్ళు చూపిస్తూంటే, నేనామె ఇల్లు చూస్తున్నానని అనుకుంటోందో! బెడ్‌రూమ్‌లోకి తీసుకెళ్ళి బెడ్ చూపిస్తూ, 'ఇది బెడ్‌రూమ్' అన్నాక అనుమానం తీరిపోయింది. నా అనుమానం తీరిపోయిందని ఆమెకి తెలిసిపోయిందల్లే వుంది. కిటికీ తలుపులు మూయడానికి వెళ్ళింది. ఉద్దేశం అర్థంకాగానే తలుపు మూసేంత కాలాన్ని కూడా వృధా చెయ్యాలనిపించలేదు. నేను ఆమె దగ్గరికి సమీపించినట్టే నాకు తెలీదు. మూసిన కిటికీ పక్కని గోడకి వాలి నాకేసి వ్యామోహంగా చూస్తోంది. నేను ఆమెను దగ్గరకి తీసుకున్నానో, ఆమె నన్ను దగ్గరకు తీసుకుందో నాకు తెలీదు. మైమర

పించే ఆమె సున్నితత్వానికి అర్థం చెప్పలేను. ఆమె స్పర్శలో మాధుర్యాన్ని వి వరించలేను. అదిమే ఆమె పెదవుల కదలికల హాయిని అన్యథా వెతుక్కోలేను. నా వీపు మీద కదిలే ఆమె అరచేతుల ఆప్యాయతకి అర్థం చెప్ప లేను.

పగలు రాత్రి అయింది.

రాత్రి రాత్రులు అయింది.

మన్మథుడు కూడా కమనీయంగా మనోహరమైన శృంగారానుభూతుల్ని తారకేశ్వరి దగ్గరతనంలో కమనీయంగా అనుభవి స్తున్నాను.

కాలం పరిగెడుతోంది. ఇదివరకు నడిచేది.

ఆయన తరచూ కాంపులకి వెళ్తున్నాడు. నేను క్రమం తప్పకుండా వాళ్ళింట్లో తప్ప కుండా కాంపులు వేస్తున్నాను.

క్రమంగా మా సాన్నిహిత్యంలో అంత రార్థం అందరికీ తెల్సిపోయింది. ముందు ఆమె ఆరపిల్ల లిద్దరికీ, తర్వాత వూళ్ళో అందరికీ. పార్థసారధి కింత వరకూ మరి ఎందుకు తెలియలేదో నా కర్థం కావటంలేదు. తెలిస్తే మరి వుపద్రవం రావాలిగా.

తారకేశ్వరితో విలాసజీవితం నాకు పాపం అనిగాని, అయ్యో! పాపం! అనిగానీ అని పించేలా చేయడంలేదు. అలా అనుకునే తీరుబాటే నా ఆలోచనకి లేకుండా పోయింది. నా శరీర వాంఛలు నా మనసుని కైవశం చేసుకున్నాయి.

కొన్నాళ్ళ తర్వాత— ఆయన ఇంట్లో లేనప్పుడే ఆమె యింటికి నేను వెళ్ళడం నాకు బాగా అలవాటయిపోయింది—

ఊరంతా మా ఇద్దరి విషయం వాయువులా వ్యాపించిన సమయంలో—

ఓరోజు రాత్రి నా యింటి పడగ్గదిలో కూచుని ఏదో ఇంగ్లీషు నావెల్కాన్ని చదూ తున్నా. బహుశా సమయం పదకొండు గంటలై వుండొచ్చు.

వీధితలుపు టకటక శబ్దమైంది. పగలే నాకు విజిటర్సు రారు. ఈ సమయంలో ఎవరొచ్చారబ్బా! అనుకుంటూ వెళ్ళి లైటు వేసి తలుపు తీసాను.

నా ఆశ్చర్యానికి హద్దులేదు.

ఆయనెవరో కాదు. తారకేశ్వరి భర్త పార్థ సారధి. ఆజానుబాహుడు. నవ్వితేనే అందం, అందమైన అలవాట్లు, నాలాంటి వాళ్ళని నలు గుర్ని కొనగలిగిన పెద్ద వుద్యోగం కలవాడు. కలవాడు. ఆయన నా ఇంటికి రావడం నాకు విడ్డూరంగానే వుంది. ఆ సమయంలో రావడం మరీ విచిత్రంగా అనిపించింది.

క్షణం అలాగే వుండిపోయి 'మీరా సర్! రండి!' అని లోపలికి ఆహ్వానించాను. పార్థ సారధి నవ్వుతూ చెయ్యి కలిపి నాతో లోపలికి వచ్చాడు.

నేను పక్కమీద కూర్చున్నా. ఈ మధ్య పక్కే బాగా అలవాటయిపోయింది మరి.

ఆయన నా కెదురుగా కూర్చున్నాడు. కాస్త మౌనం తర్వాత ఆయనే మాట్లాడాడు. 'చూడండి శశాంకగారూ! యీ టైములో రావడానికి కారణం మీరు తీరిగ్గా ఒంటరిగా దొరుకుతారనీ నేమాట్లాడేది నేనూ మీరు కూడా ముఖ్య విషయంగా భావించుకోవచ్చనీ!' ఆగాడు.

నేను 'చెప్పండి' అన్నా ధైర్యంగా.

ఏమీ లేదు. మీరు నా ఫామిలీ ఫ్రెండ్, నాకూ, మా ఆవిడకీ మేలుకోరే ఆప్తమిత్రులు. సంస్కారం గల మంచి రచయితలు. అభి మానంతో తరచు మనం కల్సుకుంటున్నాం. మీరు మా యింటికి తరచూ వచ్చిపోతున్నారు. నేను లేనప్పుడు వచ్చినా, ఉన్నప్పుడు వచ్చినా మా ఆవిడతో సాహిత్యాన్ని చర్చించి, ఆమె



దీపావళి నాడు తుపాకీ చూపెడితే ఏ వెధవా భయపడి చావడు
ఇది లూటీల దా కత్తి ఇలా ఇవ్వు !



ఒంటరితనం ఫీల్ కాకుండా చై మే కాకుండా, ఆమెకు సాహితీ వికాశాన్ని కూడా కల్గిస్తున్నారు. నిజంగా మీలాంటి మిత్రుడు మా యిద్దరికీ తారసపడటం నాకెంతో సంతోషంగా వుంది. కానీ శశాంకగారూ! ఈ మధ్యనే ఓ విచిత్రం జరిగింది. నేనూ మా ఆవిడా కలిసి సినిమా చూడ్డానికి వెళ్ళాం. థియేటరు గేట్లోకి అడుగుపెట్టగానే పక్కనున్న గోడమీద— మా రాబోయే చిత్రం 'తారాశశాంకం' అని బొగ్గుతో అగ్లీగా రాసుంది. నేను ఆగి చదివాను. అహఁ కాదు. చదివి ఆగిపోయానెందుకో. అప్పుడు మా వెనక ఏవో పక్కిరింతలు, నవ్వులూ నాకు వినిపించాయి. మన లోకాలిటీలో అందరికీ తెల్సిన పెద్ద ఆఫీసర్నైన నేను ఆ క్షణం ఎంతో చిన్నతనంతో ఇబ్బందిగా ఫీలయిపోయాను. నా బి.పి. రైజయి అక్కడే చచ్చిపోతానా అనుకున్నాను.'

నాకు బి.పి. రైజవుతున్నట్లు వుంది.

'కానీ అంతలోనే హాలు కుర్రాడు మరో కొత్త చిత్రం తాలూకు వాల్ పోస్టర్ తెచ్చి, ఆ బొగ్గు రాతమీద అతికించి కప్పేసి నా ప్రాణాలు కుదుటబెట్టాడు. ఎలాగైతేనేం వెనక్కి తిరిగి పోకుండా సినిమా చూశాం.' ఆయన మళ్ళీ ఆగాడు,

నేను కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాను.

'మా ఫామిలీతో మీ పరిచయం ఎంతో పవిత్రమయింది. మీ మనసు నాకు తెలుసు. ఎంతో నిష్కల్మషమయినది. కానీ మనచుట్టూ వున్న చౌకబారు జనం అర్థం చేసుకునే తాహతు లేక పుకార్లు పుట్టించి ప్రచారం చేస్తున్నారు. ఆస్కాండల్సు మీదాకా కూడా వచ్చేవుంటాయి. కానీ చూడండి, నాకు మీ గురించి అంతా తెల్సినా కూడా నా ఆత్రుత కొద్దీ ఓ మాట మీతో చెప్పాల్సొస్తోంది.'

భయం తగ్గినా నా చేతిలో సిగరెట్టింకా వణుకుతోంది.

'నాకు తెలుసు. నా కిద్దరు పెళ్ళికెదిగిన ఆడపిల్లలున్నారు. వాళ్ళని పెద్ద చేశాను. కష్టపడి చదివించాను. నేను పెద్ద ఆఫీసర్ని. నాకేం లోటులేదు. వాళ్ళకి మంచి భవిష్యత్తుని ఇవ్వగలను. కానీ ఇప్పుడు దురదృష్టం కొద్దీ ఈ స్కాండల్స్ వచ్చాయి. అవి కేవలం నాకూ నా మిసెస్‌కీ సంబంధించినవి. నా కోసం పెద్దల కారణంగా నా పిల్లల బంగారు భవిష్య జీవితాలు నాశనం కాకూడదు. ఆ బెంగతోనే నేను మీ దగ్గిరికి వచ్చాను. ఈ రూమర్స్ విని మీరు మా ఇంటికి రావటం మానద్దు. మీ సాహిత్య గోష్టి కూడా మానవద్దు. ఎప్పటిలా మీరు మా ఇంటికి వస్తూనే వుండాలి. మాతో కలిసిమెలిసి స్పెండ్ చెయ్యాలి. నా బాధల్లా ఒక్కటే. అకస్మాత్తుగా మీరు మా ఇంటికి ఈపాడు ప్రచారం కారణంగా రావటం మానేస్తే అవి అంతా నిజాలనుకుని భ్రమించి నమ్మితే, ఏ పాపం ఎరుగని నా బిడ్డల భవిష్యత్తు దెబ్బతింటుంది. అసలే ఆడపిల్లలు. నా ఆరాటమల్లా ఒక్కటే. నా పిల్లలికి నేను కన్నందుకు పూర్తి న్యాయం చేయాలి' అని సడెన్‌గా ముగిస్తూ పార్థసారథి లేచాడు.


'నేను సంప్రదాయ కుటుంబంలో పుట్టి వస్తానండీ!' వెనక్కి తిరిగాడు. నేను వెన్నుపోటు పొడిచే వాడిలా అనుసరిస్తూ నడిచే గేటు దగ్గర ఆగి, ఆయన అమాయకంగా అన్నాడు.

'శశాంకగారూ! నా పిల్లలంటే నా కెంతో ప్రేమ. ఎవరి కారణంగానో వాళ్ళ జీవితాలు నాశనం చెయ్యలేను. దయచేసి మీరు ఎప్పటి లాగానే మా యింటికి వస్తూ వుండండి. గుడ్‌నైట్' అని, కాల్చే ఆలోచనల్తో నిలువునా వేడెక్కిపోయిన నన్ను ఆపేక్షగా చూసి, నా చేతుల్ని తన చేతుల్తో మెత్తగా వత్తి ముందుకు కదిలిపోయాడు తారకేశ్వరి భర్త పార్థసారథి.

నీతిని నిప్పుకొరడాచేసి సంస్కార భరితంగా నా వీపు ఛెళ్ళుమనిపించి నాకు కనువిప్పు కల్గించాడాయన. ఆయన వెళ్ళిపోతూ నా చేతిని అదిమినప్పుడు నేను ఫీలయిన పవిత్రత నేను తారకేశ్వరిని తొలిసారి వాటేసుకున్న అనుభూతికంటే ఉత్కృష్టమైందని తెల్సుకో గలిగాను. శరీరంకంటే మనసు గొప్పది, విలువైంది అనే నిజాన్ని అర్థం చేసుకో గలిగాను.

ఆనాటి నుంచీ నేను తారకేశ్వరిని మళ్ళీ కలియలేదు. కలియడానికి ప్రయత్నించనూ లేదు. ఆ తర్వాత నాకు బదిలీ అయిపోయింది.

—చేతిమీద చినుకుపడితే ఉలిక్కిపడ్డాను. ఖాళీ స్టేషన్లోంచి కదిలి బైటపడ్డాను.





జ్యోతి